www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 4 సెప్టెంబరు 2025
5
ఏలూరు



యూరియా కోసం అవస్థలు


యూరియా కోసం రైతుల పడిగాపులు

ప్రజాశక్తి - చింతలపూడి

చింతలపూడి మండలంలో యూరియా కోసం రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. యూరియా కొరత ఉండటంతో రైతులు గోడౌన్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. పనులు మానుకుని చింతలపూడి డిసిఎంఎస్ వద్దే గంటల తరబడి ఉంటున్నామని రైతులు వాపోతున్నారు. సర్వర్ పనిచేయడం లేదని, నాలుగు ఎకరాలు లోపు ఉంటే ఒక బస్తా యూరియా, నాలుగు ఎకరాలు దాటితే రెండు బస్తాలు ఇస్తున్నారని, అవి సరిపోక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రైతులకు సరిపడా యూరియా అందించాలని సిపిఎం నాయకులు పాండు రంగారావు డిమాండ్ చేశారు.

ట్రంప్ బాదుడుతో..
రొయ్య ధర పతనం..!



50 శాతం సుంకాల అమలుతో పరిస్థితి దారుణం
ధరలను శాసిస్తున్న ప్రాసెసింగ్ కంపెనీలు
ప్రతి కౌంట్‌పైనా రూ.30 నుంచి రూ.100 వరకూ తగ్గుదల
కౌంట్‌ను బట్టి ఎకరాకు రూ. 40 వేల నుంచి రూ. 2 లక్షల వరకూ నష్టం
ప్రభుత్వాలు పట్టించుకోకపోతే సాగు ప్రశ్నార్థకం
ఆందోళనలో ఆక్వా రైతాంగం

ప్రజాశక్తి - భీమవరం

అంతర్జాతీయ విపణిలో 'డాలర్ల' సిరులు కురిపించే ఆక్వా రంగం అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దెబ్బకు విలవిల్లాడుతోంది. 50 శాతం సుంకాలు విధించడంతో ఆక్వా రైతుకు తీవ్ర నష్టం కలుగుతోంది. ఈ బూచిని చూపిస్తూ దళారులు దోపిడీకి తెరతీశారు. రోజురోజుకీ ధరలు పతనమవుతుండటంతో రైతు పరిస్థితి అగమ్యగోచరంగా తయారైంది. ప్రస్తుత తరుణంలో సాగు చేయాలా, వద్దా.. చేస్తే ఎలా చేయాలనే గందరగోళంలో పడిపోయాడు.

ట్రంప్ మరోసారి 50 శాతం సుంకాల విధింపు ఆక్వా రైతులకు తీవ్ర నష్టాన్ని చేకూరుస్తోంది. సీడ్, ఫీడ్, వైరస్, విద్యుత్ బిల్లులు, అధిక పెట్టుబడులతో సతమతమవుతున్న ఆక్వా రైతాంగానికి ఈ సుంకాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. ఏటా నాలుగు లక్షల టన్నుల రొయ్యలు ఉత్పత్తి అవుతున్నాయి. దీనిలో సుమారు 3.5 లక్షల టన్నుల వరకూ విదేశాలకు ఎగుమతి చేస్తున్నారు. భారత్ నుంచి విదేశాలకు ఎగుమతవుతున్న మాంసాహార ఉత్పత్తుల్లో రొయ్యలది మూడో స్థానం. ఆక్వా ఉత్పత్తుల ఎగుమతుల్లో రాష్ట్రంలో ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాదే సింహభాగం. మొత్తంగా రూ.18 వేల కోట్ల వ్యాపారంలో విదేశీ లావాదేవీల వాటే అధికంగా ఉంది. అమెరికా ప్రకటించిన 50 శాతం సుంకాల అమలుతో ఆక్వారంగం ఒక్కసారి కుదేలైంది. ఈ పరిస్థితుల్లో తాము సాగు కొనసాగించలేమని ఆక్వా రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తమ పరిస్థితిని అర్థం చేసుకుని కేంద్ర ప్రభుత్వం రైతులపై సుంకాల భారం లేకుండా చేయాలని వారు కోరుతున్నారు. విదేశీ ఎగుమతులను ప్రోత్సహించడానికి కేంద్రం రాయితీ ఇవ్వాలి లేదా అమెరికాపై ఒత్తిడి చేసి సుంకం తగ్గించేలా చేయాలని అంటున్నారు. ఒక్కసారిగా రొయ్యల ధరలు పడిపోవడంతో ఇదే అదనుగా ప్రాసెసింగ్ యూనిట్లు, ఎక్స్‌పోర్ట్ ఏజెన్సీలు, మధ్యవర్తులు రొయ్యల కొనుగోలుకు షరతులు విధిస్తున్నారు.

ఎకరాకు రూ.30 వేల నుంచి రూ.2 లక్షల వరకూ నష్టం..

ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 2.90 లక్షల ఎకరాల్లో ఆక్వా సాగు చేస్తున్నారు. దీనిలో సుమారు 1.10 లక్షల ఎకరాల్లో రొయ్యల సాగు చేస్తున్నారు. ఈ సాగులో 98 శాతం అమెరికా, చైనా, దుబాయ్ వంటి దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ప్రస్తుతం ఆక్వారంగం పరిస్థితులు తలకిందులయ్యాయి. వంద కౌంట్ రొయ్యలు కిలో రూ.270 ఉంటే ప్రస్తుతం రూ.230గా ఉంది. 60 కౌంట్ ధర రూ.305కు పడిపోయింది. ప్రతి కౌంట్‌కూ రూ.30 నుంచి రూ.100 వరకూ తగ్గింది. దీన్ని బట్టి చూస్తే సాగుదారులు ఎకరాకు రూ.40 వేల నుంచి కౌంట్‌ను బట్టి రూ.2 లక్షలు వరకూ నష్టపోతున్నారు. పంట చేతికందే దశలో ఒక్కసారిగా ధరలు పడిపోవడంతో దిక్కుతోచని స్థితిలో పడ్డారు. ఈ పరిస్థితి ఎంతకాలం ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. అనుబంధ పరిశ్రమలపైనా ఈ ప్రభావం పడుతోంది.

ధరలను శాసిస్తున్న ప్రాసెసింగ్ కంపెనీలు..

మార్కెట్‌ను ఎక్స్‌పోర్టు చేస్తున్న ప్రాసెసింగ్ కంపెనీలు శాసిస్తున్నాయి. ధరలను తమకు ఇష్టం వచ్చినట్లు తగ్గించేస్తున్నారు. పరిస్థితి ఇలాగే కొనసాగితే ఆక్వా సాగు నిలిపివేయడమేగాక అప్పులు తీర్చలేక ఆత్మహత్యలే శరణ్యమని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి మాయాజాలం కారణంగా నెల రోజుల్లో ధరలు భారీగా పడిపోయాయి. 25 కౌంట్ రొయ్య ధర కేజీ రూ.680 పలికింది. ట్రంప్ నోట టారిఫ్ మాట వచ్చిందో, లేదో వ్యాపారులు సిండికేటయ్యి ధరలు అమాంతం తగ్గించేశారు. ప్రస్తుతం 25 కౌంట్ రొయ్య ధర కేజీ రూ.460, 30 కౌంట్ ధర కేజీ రూ.395, వనామీ రకం 30 నుంచి 40 కౌంట్ రూ.370, 100 కౌంట్ ధర కేజీ రూ.220 పలుకుతోంది. ఈ ధరలు ఇంకా పతనమైతే రైతులు రొయ్యల సాగు మానడం తప్ప వేరే గత్యంతరం లేదని ఆందోళన చెందుతున్నారు. ప్రస్తుతం ధరలు తక్కువ ఉన్నప్పటికీ కొనుగోలుకు వ్యాపారులు ముందు రావడం లేదు. పెద్ద రైతులు మాత్రమే కొంతవరకూ అమ్ముకోగలుగుతున్నారు. చిన్న, సన్నకారు రైతుల పరిస్థితి దయనీయంగా మారింది.

ఖర్చులు రావడం గగనమే..

ప్రస్తుతం చెరువుల లీజు, విద్యుత్ ఛార్జీలు, ఫీడ్ ధరలతో 100 కౌంట్ రావాలంటే కిలోకు రూ.290 నుంచి రూ.280 ఖర్చవుతుంది. అదే 50 కౌంట్‌కు చేరాలంటే కిలోకు రూ.340 నుంచి రూ.300, గరిష్టంగా 30 కౌంట్‌కు రావాలంటే కిలోకు రూ.460 నుంచి రూ.500 ఖర్చవుతుంది. అదే 20 కౌంట్ రావాలంటే రూ.500పైనే ఖర్చవుతుంది. ఎకరా సాగుకు సీడ్, సాగుకు అవసరమైన హెల్త్‌కేర్ మినరల్స్, కరెంటు ఛార్జీలు, కూలీ ఖర్చులు అన్నీ కలుపుకుని సుమారు రూ.7.50 లక్షలు వ్యయమవుతుంది. ధరలు ఇంకా పతనమైతే రైతులు ఆర్థికంగా కుదేలు కావాల్సిందేననే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

మార్క్‌ఫెడ్‌ను రంగంలోకి దించాలి..

ప్రస్తుతం మార్కెట్లో ధరల ప్రకారం రైతుకు కష్ట కాలమే. కూటమి ప్రభుత్వం జోక్యం చేసుకుని మార్క్‌ఫెడ్ ద్వారా రొయ్యల కొనుగోలు చేపట్టాలని రైతులు కోరుతున్నారు. లేనిపక్షంలో వ్యాపారులపై ఒత్తిడి చేసి ధరలు పెరిగేలా చేస్తే తప్ప ప్రస్తుత పరిస్థితుల్లో రొయ్య రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది.

తగ్గుతూ.. పెరుగుతూ..!

గోదావరికి కొనసాగుతున్న వరద ఉధృతి
ముంపులోనే గుండేటి, ఎద్దు వాగు కాజ్‌వేలు
15 రోజులుగా 25 గ్రామాలకు నిలిచిన రాకపోకలు
పోలవరం నుండి 8,61,386 క్యూసెక్కుల నీరు విడుదల


ఎద్దువాగు వద్ద పడవలపైనే రాకపోకలు

ప్రజాశక్తి - కుక్కునూరు రూరల్

పెరుగుతూ.. తగ్గుతూ గోదావరి వరద దోబూచులాడుతోంది. భద్రాచలంలో బుధవారం ఉదయం 39.50 అడుగులకు తగ్గిన గోదావరి నీటిమట్టం ఆ తర్వాత క్రమంగా పెరుగుతూ సాయంత్రానికి 41.60 అడుగులకు చేరుకుంది. ఇప్పటికే గత 15 రోజులుగా కుక్కునూరు-దాచారం మధ్య గుండేటి వాగు కాజ్‌వే ముంపులోనే ఉండటంతో వాగు అవతల ఉన్న 12 గిరిజన గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు మండల కేంద్రానికి వచ్చేందుకు అనేక వ్యయప్రయాసలు పడుతున్నారు. ముత్యాలంపాడు-వింజరం మధ్య పాలవాగు కాజ్‌వే పైనుంచి రాకపోకలు యధావిధిగా సాగుతున్నాయి. అయితే వరద మళ్లీ పెరుగుతుండటంతో ఆ మార్గంలో రాకపోకలు సాగించే వారిలో ఆందోళన నెలకొంది.

వేలేరుపాడు రూరల్ : తాత్కాలికంగా గోదావరి వరద తగ్గినా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మళ్లీ పెరుగుతుండటంతో మండల ప్రజల్లో ఆందోళన నెలకొంది. మండలంలోని యడవల్లి వద్ద ఉన్న ఎద్దు వాగు, రుద్రంకోట రహదారి వద్ద ఉన్న సప్టా ముంపులోనే ఉండటంతో ఆ మార్గంలో రాకపోకలు పునరుద్ధరణ కాలేదు. దీంతో రుద్రంకోట, కోయిదా, కట్కూరు, కాకిసినూరు, తాళ్లగొంది, పూచిగొంది తదితర సుమారు 18 గ్రామాలకు రాకపోకలు పున:ప్రారంభం కాలేదు.

పోలవరం: పోలవరం వద్ద గోదావరి నీటిమట్టం బుధవారం నిలకడగా ఉంది. పోలవరం ప్రాజెక్టులోకి అదనంగా వస్తున్న 8,61,386 క్యూసెక్కుల జలాలను అధికారులు దిగువకు విడుదల చేస్తున్నారు. ప్రాజెక్టు స్పిల్‌వే ఎగువన 32.020 మీటర్లు, స్పిల్‌వే దిగువన 23.400 మీటర్లు, ఎగువ కాపర్ డ్యామ్ ఎగువన 32.700 మీటర్లు, దిగువ కాపర్ డ్యామ్ దిగువన 22.900 మీటర్లు, ఎగువ, దిగువ కాపర్ డ్యాముల మధ్య 15.950 మీటర్లు నమోదైనట్లు జలవనరుల శాఖాధికారులు తెలిపారు. పట్టిసీమ క్షేత్రం చుట్టూ ఇసుకదిన్నెలు తేలుతున్నాయి.

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ఇవ్వాల్సిందే

టి.నర్సాపురం, నర్సాపురం గ్రీన్‌ఫీల్డ్ హైవేపై రైతులు రాస్తారోకో
సమస్యల పరిశీలనకు అధికార బృందం పర్యటన
వినతులు అందించిన గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులు


టి.నర్సాపురం: వినతి అందిస్తున్న రైతులు

ప్రజాశక్తి - టి.నర్సాపురం

గ్రీన్‌ఫీల్డ్ హైవేకు సర్వీస్ రోడ్లు ఇవ్వాల్సిందేనని గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ, ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం ఆధ్వర్యంలో టి.నర్సాపురం వద్ద గ్రీన్‌ఫీల్డ్ హైవేపై బుధవారం రైతులు రాస్తారోకో నిర్వహించారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల సమస్యల పరిశీలనకు జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు తహశీల్దార్, హైవే అధికారులు, రోడ్డు నిర్మాణ సంస్థ బెకం కంపెనీ ప్రతినిధులు బృందం పరిశీలనకు వచ్చారు. టి.నర్సాపురం మండలంలోని టి.నర్సాపురం, గురవాయిగూడెం, ఏపుగుంట, మధ్యాహ్నపువారిగూడెం, వెంకటాపురం, బొర్రంపాలెం తదితర గ్రామాల వద్ద భూనిర్వాసిత రైతులు తమ సమస్యలను ఏకరువు పెట్టారు. అన్నిచోట్లా సమస్యలు రైతులు చెప్పడంతో నివేదిక తయారు చేసి జిల్లా కలెక్టర్‌కు నివేదిక పంపిస్తామని చెప్పారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్, గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు దేవరపల్లి సత్యనారాయణ, వెదుళ్ల నాగేశ్వరరావు, లింగారెడ్డి శ్రీనివాస్, నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు, బొంతు మురళీ తదితరులు మాట్లాడుతూ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం వల్ల రైతులు, ప్రజలు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సర్వీస్ రోడ్లు గ్రావెల్ రోడ్లుగా నిర్మిస్తామని ఇచ్చిన హామీలు అమలు చేయకపోవడం వల్ల తమ పొలాలకు వెళ్లే మార్గం లేక, పంటలు తెచ్చుకునే అవకాశం లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. అనేకచోట్ల ట్రాక్టర్లు సర్వీస్ రోడ్లలో దిగబడి నానా తంటాలు పడాల్సి వస్తోందన్నారు. కొన్నిచోట్ల కరెంటు స్తంభాలు అడ్డంగా ఉండిపోయాయన్నారు. సర్వీస్ రోడ్లలో మొక్కలు వేయొద్దని డిమాండ్ చేశారు. టి.నర్సాపురం 112వ అండర్ పాస్ వద్ద సర్వీస్ రోడ్డు గుండా వెళ్లే అవకాశం లేదన్నారు. కొన్నిచోట్ల కల్వర్టులు నిర్మించలేదన్నారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల రైతులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

గురవాయిగూడెం వద్ద..

జంగారెడ్డిగూడెం: గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతులు గురువాయిగూడెం వద్ద జంగారెడ్డిగూడెం-ఏలూరు రోడ్డులో బుధవారం రాస్తారోకో నిర్వహించారు. సర్వీస్ రోడ్లు ప్రొవిజన్ కల్పించాలని, సర్వీస్ రోడ్‌లో మొక్కలు, చెట్లు వేయొద్దని నినదించారు. జెసి ఆదేశాల మేరకు తహశీల్దార్, హైవే అధికారులు, రోడ్డు నిర్మాణ సంస్థ బెకం ప్రతినిధులు గ్రీన్‌ఫీల్డ్ హైవే భూ నిర్వాసిత రైతుల సమస్యల పరిశీలనకు అక్కడకొచ్చారు. ఈ క్రమంలో పరిసర గ్రామల రైతులు అక్కడకు చేరుకుని తమ సమస్యలు ఏకరువు పెట్టారు. గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు వామిశెట్టి హరిబాబు మాట్లాడుతూ గురవాయిగూడెం ఎగ్జిట్ పాయింట్ వద్ద సర్వీస్ రోడ్డుకు అవకాశం లేకుండా హైవే నిర్మించారని, తమ పొలాలకు ఎలా వెళ్లాలని ప్రశ్నించారు. బైనేరు వద్ద వంతెన నిర్మిస్తామని హామీ ఇచ్చి డిజైన్‌లో లేదనడం ఏమిటని నిలదీశారు. కార్యక్రమంలో మాజీ జెడ్‌పిటిసి శీలం రామచంద్రరావు, భూనిర్వాసిత రైతులు పుసులూరి శ్రీహరి, గోలి నర్సిరెడ్డి, వందనపు సాయిబాబా, అందుగుల మోహన్‌రావు, రైతులు పాల్గొన్నారు.

కొయ్యలగూడెం: సమస్యల పరిష్కారం కోరుతూ ఎపి రైతుసంఘం, గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ ఆధ్వర్యంలో తహశీల్దార్, హైవే అధికారులకు బుధవారం వినతిపత్రాలు అందజేశారు. రెవెన్యూ, హైవే అధికారుల బృందం గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణం వల్ల వస్తున్న సమస్యలను అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ సర్వీస్ రోడ్లు నిర్మించకపోతే తమ పొలాలకు వెళ్లే మార్గాలు ఉండవని, తమకు ఆత్మహత్యలే శరణ్యమని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రీన్‌ఫీల్డ్ హైవే భూనిర్వాసిత రైతుల పోరాట కమిటీ నాయకులు కొడవటి రామకృష్ణ, పసల శ్రీనివాసరావు, మార్ని శ్రీనివాస్ తదితరులు మాట్లాడారు.

టేక్ హోమ్ రేషన్ పంపిణీ మార్గదర్శకాలను పాటించాలి

అధికారులకు జెసి ధాత్రిరెడ్డి ఆదేశం



ప్రజాశక్తి - ఏలూరు

టేక్ హోమ్ రేషన్ పంపిణీ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని జెసి పి.ధాత్రిరెడ్డి తెలిపారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సప్లిమెంటరీ న్యూట్రిషన్ ప్రోగ్రాం బాల సంజీవని కార్యక్రమాలపై జిల్లా, ఐటిడిఎ స్థాయి మానిటరింగ్ అండ్ రివ్యూ కమిటీ సమావేశం బుధవారం కలెక్టరేట్‌లోని జెసి ఛాంబర్‌లో జాయింట్ కలెక్టర్, ఎస్ఎన్‌పి కమిటీ ఛైర్‌పర్సన్ పి.ధాత్రిరెడ్డి అధ్యక్షతన జరిగింది. ప్రాజెక్ట్ స్థాయిలో అంగన్వాడీ కార్యకర్తలు, లబ్ధిదారులకు టేక్ హోమ్ రేషన్ పంపిణీ మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని, సకాలంలో డెలివరీ, జవాబు దారీతనం ఉండేలా చూడాలని ప్రాజెక్ట్ డైరెక్టర్, సిడిపిఒలను జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. గుడ్లు, కిట్లు, పాల సరఫరా స్థితి, నాణ్యతను సమీక్షించారు. ప్రతి నెలా గుడ్లు, బాల సంజీవని కిట్లు, పాల మూడు గొడౌన్‌లను పీడీ, సిడిపిఒలు సందర్శించి, రిమార్కులను గొడౌన్ వద్ద ఉంచిన రిజిష్టర్‌లో నమోదు చేయాలన్నారు. సరఫరా చేయబడిన కోడిగుడ్ల కలర్ స్టాంపింగ్ కలిగి ఉండాలన్నారు. పాలు, బాలసంజీవని కిట్లు ప్యాకింగ్, ఆహార భద్రత నిబంధనల ప్రకారం ఉండాలని ఆదేశించారు. ఐటిడిఎ పిఒ చిన్న సైజు గుడ్లు సరఫరా అవుతున్నాయని జెసి దృష్టికి తేగా ఈ విషయమై ఆమె స్పందిస్తూ ప్రతి గుడ్డూ 50 గ్రాముల బరువు ఉండాలని, వేయింగ్ మిషన్‌లు లీగల్ మెట్రాలజీ డిపార్ట్మెంటు వారు సీల్ వేసిన మిషన్లు మాత్రమే కోడి గుడ్డు బరువు ప్రమాణాలను నిర్దేశించటానికి వాడాలని తెలిపారు. ప్రాజెక్ట్ డైరెక్టర్, సిడిపిఒలు తప్పనిసరిగా అంగన్వాడీ సెంటర్లను సందర్శించాలన్నారు. ఆహార పంపిణీ మార్గదర్శకాలను, నాణ్యతా ప్రమాణాలను సందర్శన సమయంలో పరిశీలించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ఐటిడిఎ పిఒ కె.రాములునాయక్, ఐసిడిఎస్ పీడీ పి.శారద, జిల్లా పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ శివరామ్మూర్తి, డిఎస్ఒ విల్సన్, సిడిపిఒలు పాల్గొన్నారు.

ఆదర్శప్రాయులు డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు

ఉద్యోగ విమరణ అభినందన సభలో డిఎంహెచ్ఒ అమృత


శ్రీనివాసరావు దంపతులను సత్కరిస్తున్న డిఎంహెచ్ఒ, తదితరులు

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సీనియర్ వైద్యులు పోతుమూడి శ్రీనివాసరావు ఉద్యోగ విరమణ అభినందన కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన డిఎంహెచ్ఒ అమృత మాట్లాడుతూ సీనియర్ వైద్య నిపుణులు పోతుమూడి శ్రీనివాసరావును పశ్చిమగోదావరి జిల్లాలో పెదపాడు శ్రీనివాసరావు అని అంటారన్నారు. తొలినాటి నుంచి పేదలకు ఉచితంగా వైద్య సేవలదించడమే లక్ష్యంగా ముందడుగు వేసినట్లు చెప్పారు. జూనియర్ డాక్టర్లకు అన్నివిధాలా తన సలహాలు అందించారని తెలిపారు. విధి నిర్వహణలో ఉండగా డాక్టర్ శ్రీనివాసరావు చేసే వైద్య సేవలను అన్ని తరగతుల ప్రజలు అభినందించినట్లు చెప్పారు. సామాన్య ప్రజల నుంచి ఉన్నతాధికారుల వరకు సీనియర్ వైద్య నిపుణులు డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు సేవల పట్ల అభినందనల జల్లు కురిపించిన సందర్భాలను సోదాహరణంగా వివరించారు. ఈ సందర్భంగా నూజివీడు ఏరియా ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పద్మజారాణి మాట్లాడుతూ డాక్టర్ శ్రీనివాస్ సేవలు నేటి యువ వైద్యులకు ఆదర్శనీయమన్నారు. అనుక్షణం పేదలకు వైద్య సేవలందించడమే లక్ష్యంగా వారి జీవితాన్ని కొనసాగించిన తీరు ప్రశంసనీయమన్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా పేదలకు వైద్య సేవలందించేందుకు డాక్టర్ పోతుమూడి శ్రీనివాసరావు ప్రణాళిక బద్ధంగా ముందడుగులు వేసేందుకు సంసిద్ధం కావడం అందరికీ సాధ్యమయ్యే పని కాదన్నారు. సామాజిక సేవ వారి బాధ్యతగా గుర్తించి ముందుకు రావడం నేటి యువతకు మార్గ నిర్దేశకత్వంగా పోతుమడి శ్రీనివాసరావు నిలుస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో డిసిహెచ్ఎస్ పాల్ సతీష్, ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

6న చలో విజయవాడ : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - బుట్టాయగూడెం

విద్యారంగంలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యంలో సెప్టెంబర్ ఆరో తేదీన జరిగే చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని జిల్లా కార్యదర్శి కె.లెనిన్ పిలుపునిచ్చారు. ఈ మేరకు స్థానిక బుట్టాయగూడెం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో బుధవారం పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కె.లెనిన్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చి సంవత్సరం పూర్తయినా విద్యార్థుల సమస్యలను పరిష్కరించలేదని, ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని విమర్శించారు. విద్యార్థుల ఫీజులు యాజమాన్యాల ఖాతాల్లోకి జమ చేస్తామని ఇచ్చిన హామీని అమలు చేయలేదన్నారు. గత రెండేళ్లుగా ఫీజు రీయింబర్స్‌మెంట్ ఒక్క దఫా కూడా పూర్తిస్థాయిలో విడుదల చేయలేదని తెలిపారు. దీంతో ఫీజులు కడితేనే పరీక్షలకు అనుమతి ఇస్తామని యాజమాన్యాలు తేల్చి చెప్పడంతో ఫీజులు చెల్లించేందుకు విద్యార్థుల తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. హాస్టళ్ల అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. యూనివర్శిటీలో ఖాళీగా ఉన్న విసి, అధ్యాపక పోస్టులు భర్తీ చేయాలని కోరారు. రాష్ట్రంలో ఉన్న విద్యార్థులందరికి ఉచిత బస్‌పాస్‌లు ఇవ్వాలని, పాఠశాల, జూనియర్ కళాశాలల్లో విద్యార్థి సంఘాలకు ప్రవేశాన్ని నిషేధిస్తూ ఇచ్చిన ఉత్తర్వులను వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్స్ పలుమార్లు తహశీల్దార్ల నుంచి కలెక్టర్, ఆయా శాఖల ఉన్నతాధికారులకు పదేపదే విన్నవిస్తున్నా ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని, దీంతో చలో విజయవాడ కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. ఈ కార్యక్రమానికి రాష్ట్రంలో ఉన్న విద్యార్థి లోకం పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు రవి, షణ్ముఖ్, జశ్వంత్ పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

మా కుమారుని హత్య కేసు దర్యాప్తు చేపట్టాలి
ఎంఎల్ఎ రోషన్‌కుమార్‌కు ముప్పిడి రాజు తల్లిదండ్రుల వినతి


ఎంఎల్ఎకు వినతిపత్రం అందిస్తున్న రాజు తల్లిదండ్రులు

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

మా కుమారుని హత్య కేసు దర్యాప్తు చేసి అసలైన నిందితులను పట్టుకుని శిక్షించాలని ముప్పిడి రాజు తల్లిదండ్రులు కోరారు. ఈ మేరకు వారు కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ ఆధ్వర్యంలో చింతలపూడి ఎంఎల్ఎ సొంగా రోషన్‌కుమార్‌కు జంగారెడ్డిగూడెంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో బుధవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీనివాసపురం గ్రామానికి చెందిన మా కుమారుడు ముప్పిడి రాజును 2021లో హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని, దీనిపై పోల్నాటి రామకృష్ణ, తదితరులపై ఎస్‌సి, ఎస్‌టి కేసు, హత్య కేసు నమోదు చేశారని చెప్పారు. ఈ కేసుకు సంబంధించి మాచర్ల శ్రీనివాస్ అనే వ్యక్తిని అరెస్టు చూపించి అసలైన నిందితులపై ఎలాంటి దర్యాప్తు లేకుండా కేసు నీరుగారుస్తున్నారన్నారు. ఈ విషయంపై ఎన్నిసార్లు వినతిపత్రాలు ఇచ్చినా పట్టించుకోవడంలేదని ఎంఎల్ఎ ప్రశ్నించారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ రాజు హత్యకు గురై ఐదేళ్లు పూర్తియిందని, ఇప్పటికీ పోస్టుమార్టం రిపోర్టు గాని, రాజు ఫోన్‌లో డేటా గాని, హత్యకు సంబంధించిన సాక్షుల విచారణ, ఎలాంటి దర్యాప్తు చేయలేదన్నారు. టిడిపి కూటమి నాయకులు ప్రతిపక్షంలో ఉండగా రాజు కుటుంబానికి న్యాయం చేస్తామని చెప్పి అధికారంలోకొచ్చాక పట్టించుకోవడంలేదన్నారు. ముప్పిడి రాజు హత్య కేసుకు సంబంధించి సమగ్రమైన దర్యాప్తు జరిపించాలని, బాధిత కుటుంబంలోని ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని, తల్లికి పెన్షన్ ఇవ్వాలని, గతంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. లేకపోతే మరోసారి దళిత, ప్రజా సంఘాలను, వామపక్ష పార్టీలను ఐక్యం చేసి పెద్దఎత్తున ఉద్యమిస్తామని, ముప్పిడి రాజు కుటుంబంతో నిరవధిక నిరాహార దీక్ష చేస్తామని చెప్పారు.

పామాయిల్ కార్మిక సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

అధ్యక్ష కార్యదర్శులుగా జె.హరీష్, టి.సత్యనారాయణ


జె.హరీష్


టి.సత్యనారాయణ

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం

పామాయిల్ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షకార్యదర్శులుగా జె.హరీష్, టి.సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఆ సంఘం జిల్లా మహాసభలో జిల్లా కమిటీని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పి.రామకృష్ణ, అధ్యక్ష కార్యదర్శులు జె.హరీష్, టి.సత్యనారాయణ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 15 వేల మంది పామాయిల్ గెలలు, మట్టలు కోసే కార్మికులు, లోడింగ్, అన్ లోడింగ్ చేసే కార్మికులు ఉన్నారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక శాఖ ద్వారా పామాయిల్ కార్మికులను గుర్తించాలని, కార్మిక చట్టాలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పటికే జిల్లాలో టి.నర్సాపురం, చింతలపూడి, జంగారెడ్డిగూడెం, జీలుగుమిల్లి, కామవరపుకోట, పెదవేగి, దెందులూరు, లింగపాలెం తదితర మండలాల్లో పామాయిల్ కార్మికులు గెలలు కోస్తూ విద్యుదాఘాతానికి గురై, తోటల్లో విషపాములు, పురుగులు కాటేయడంతో చాలామంది కార్మికులు చనిపోవడం, వికలాంగులుగా మారడం జరుగుతుందన్నారు. ఇలాంటి నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఉద్యాన శాఖ, కార్మిక శాఖ కనీసం పట్టించుకోకపోవడం కార్మికుల పట్ల దుర్మార్గంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. పామాయిల్ గెలలు నరికే కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయడంతో పాటు ఇన్సూరెన్స్ కల్పించాలన్నారు. ఫ్యాక్టరీ యాజమాన్యాల ద్వారా గ్రూప్ ఇన్సూరెన్స్ ఏర్పాటు చేయాలని కోరారు. ఈ మధ్యకాలంలోనే జిల్లాలో సుమారు పదిమంది పామాయిల్ కార్మికులు విద్యుదాఘాతంతో చనిపోయారని, వారికి రాష్ట్ర ప్రభుత్వం నేటికీ ఒక్క రూపాయి కూడా నష్టపరిహారం ఇవ్వలేదని ఎద్దేవా చేశారు. పామాయిల్ కార్మికులకు సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని, పలు తీర్మానాలు చేశారు.

యాసిడ్ దాడి కేసులో
ముగ్గురు నిందితులకు జీవిత ఖైదు

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

2023లో యాసిడ్ దాడిలో ఏలూరుకు చెందిన ఎడ్ల ఫ్రాన్సిక (38) మృతి చెందిన కేసులో నిందితులకు ప్రత్యేక ఎస్సి ఎస్టి పోక్సో ఎనిమిదో అదనపు జిల్లా న్యాయమూర్తి జీవిత ఖైదు విధించారు. మరో నిందితుడికి జరిమానా విధించారు. జీవిత ఖైదు విధించిన నిందితులు ఈ తీర్పును సవాలు చేస్తూ హైకోర్టును ఆశ్రయించారు. గౌరవ హైకోర్టు ఈ కేసు రిట్రైల్ చేయాలని సూచించింది. తిరిగి ఈ కేసులో రీ ట్రయల్ నిర్వహించారు. ఈ రీ ట్రయల్‌లో పోలీసుల తరపున వాదనలు వినిపించగా టెక్నికల్ ఎవిడెన్స్‌ను ముద్రగడ భరత్ అందించారు. కీలక టెక్నికల్ ఎవిడెన్స్‌ను కోర్టుకు సమర్పించారు. తిరిగి నిందితులకు శిక్షలు పడేందుకు సహకరించారు. దీంతో ఎస్‌పి ప్రతాప్ శివ కిషోర్ భరత్‌కు ప్రశంస పత్రం అందించి సన్మానించారు. 12 ఏళ్లుగా తాను పోలీసులకు టెక్నికల్ సహాయ సహకారాలు అందిస్తున్నానని, పోలీసు శాఖ నుంచి అనేక అవార్డులు, రివార్డులు పొందానని గరుడ టెక్నికల్ సంస్థ అధినేత ముద్రగడ భరత్ తెలిపారు.

ఉత్సాహంగా, ఉల్లాసంగా ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - ముదినేపల్లి



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థిని

స్థానిక వికాస్ జూనియర్ విద్యాంజలి డిగ్రీ కళాశాలలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఉల్లాసంగా ఉత్సాహంగా జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థుల ఆట పాటలతో డ్యాన్సులతో, కేరింతలతో ప్రాంగణమంతా మారుమోగింది. విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరిని ఆకట్టుకున్నాయి. కోకో సెక్రటరీ ఎం.ప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వికాస్ విద్యాంజలి సంస్థల కరస్పాండెంట్ మదన్ మోహన్, గౌతమ్ ది విన్నర్ ప్రిన్సిపల్ జి.రాజ్యలక్ష్మి, వికాస్ కళాశాల ప్రిన్సిపల్ నక్క కనక మోహన్‌రావు, సీనియర్ ఉపాధ్యాయులు కెవి.సుబ్బారావు, సిహెచ్.దినేష్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సిఎం సహాయ నిధి చెక్కుల పంపిణీ

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

అనారోగ్యంతో బాధపడేవారికి సిఎం సహాయ నిధి సంజీవని వంటిదని ఏలూరు ఎంఎల్‌ఎ బడేటి చంటి చెప్పారు. సిఎం రిలీఫ్‌ఫండ్‌తో ఎంతోమంది బాధితుల జీవితాల్లో ఆర్థిక భరోసా నింపుతున్నామన్నారు. ఏలూరులోని ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో బుధవారం నిర్వహించిన చెక్కుల పంపిణీ కార్యక్రమంలో 22 మంది లబ్ధిదారులకు రూ.8,58,189 విలువైన సిఎం సహాయ నిధి చెక్కులను పంపిణీ చేశారు. రూ.10.50 లక్షల విలువైన రెండు ఎల్‌ఒసిలను అందించారు. అనంతరం మీడియాతో మాట్లాడిన ఎంఎల్‌ఎ చంటి పేదవారికి ఆర్థిక భరోసా కల్పించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో ఇడా ఛైర్మన్ పెద్దిబోయిన శివప్రసాద్, కో - ఆప్షన్ సభ్యులు చోడే వెంకటరత్నం, ఎస్‌ఎంఆర్ పెదబాబు, వివిధ హోదాల్లో ఉన్న టిడిపి నాయకులు, తదితరులు పాల్గొన్నారు.


పొలం పిలుస్తోంది కారక్రమంలో గంగాధర్

సమస్యల పరిష్కారానికే 'పొలం పిలుస్తోంది'

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

వ్యవసాయంలో రైతాంగం ఎదుర్కొనే సమస్యలు పరిష్కరించడానికే పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు మండల వ్యవసాయ శాఖాధికారి కె.గంగాధర్ తెలిపారు. మండలంలోని పి.అంకంపాలెం రైతు సేవా కేంద్రం పరిధిలో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా పలు రకాల పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని సొసైటీల్లో 25 టన్నుల యూరియా అందుబాటులో ఉందని తెలిపారు. నానో యూరియా కూడా ప్రయివేట్ డీలర్ల దగ్గర ఉందని తెలిపారు. అవసరమైన రైతులు ఆయా సొసైటీలకు వెళ్లి యూరియాను తెచ్చుకోవచ్చని కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం అసిస్టెంట్ ప్రశాంత్, ఎపిసిఎన్‌ఎఫ్ సిబ్బంది, పలువురు రైతులు పాల్గొన్నారు.


యూరియా పంపిణీ చేస్తున్న ఛైర్మన్ శ్రీనివాసరావు, ఎఒ భవాని

అందుబాటులో యూరియా

ప్రజాశక్తి - ఆగిరిపల్లి

యూరియా సరఫరా పట్ల రైతులు ఆందోళన చెందొద్దని, వినియోగానికి తగిన విధంగా యూరియా అందుబాటులో ఉందని మండల వ్యవసాయాధికారి జె.భవాని అన్నారు. మండల పరిధిలోని ఆగిరిపల్లి, ఈదులగూడెం, కృష్ణవరం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో, మన గ్రోమోర్ సెంటర్‌లో జరుగుతున్న యూరియా పంపిణీ కార్యక్రమాలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆగిరిపల్లి పిఎసిఎస్‌లో 11 మెట్రిక్ టన్నులు, ఈదులగూడెం పిఎసిఎస్‌లో 11.250 మెట్రిక్ టన్నులు, కృష్ణవరం పిఎసిఎస్‌లో 11.250 మెట్రిక్ టన్నులు, మన గ్రోమోర్ సెంటర్‌లో 15 మెట్రిక్ టన్నులు మొత్తం కలిపి 48.500మెట్రిక్ టన్నులు యూరియా అందుబాటులో ఉందని, ఈదర, అడవినెక్కలం పిఎసిఎస్‌ల్లో గురువారం నుంచి యూరియా అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో ఈదులగూడెం పిఎసిఎస్ ఛైర్మన్ ఈలప్రోలు శ్రీనివాసరావు, సిఇఒ జాలిపర్తి శ్రీనివాసరావు, ఆగిరిపల్లి, కృష్ణవరం సిఇవో ఎం.రంగారావు, బి.మధు పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ

ప్రజాశక్తి - ముసునూరు

జనసేన అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ పుట్టినరోజును పురస్కరించుకుని మండలంలోని చెక్కపల్లి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జనసేన నేత మామిడిశెట్టి సత్తిబాబు ఆధ్వర్యంలో పుస్తకాలు, పెన్నులు, పెన్సిళ్లు, రబ్బర్లు, చాక్లెట్లు, బిస్కెట్లు అందించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు తోట ప్రభాకర్, సూరేపల్లి మల్లిబాబు, మామిడిశెట్టి సత్తిబాబు, కార్యకర్తలు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు - ఘోరాలు

అప్పుల బాధ తాళలేక...

ప్రజాశక్తి - ముసునూరు

అప్పుల బాధ తాళలేక పురుగుల మందు తాగి వ్యవసాయ కూలీ ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన మండలంలోని కొర్లకుంట శివారు సింహాద్రిపురం గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన గంపా సాంబశివరావు (45) వ్యవసాయ కూలీ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో ఆయన అప్పుల బాధ తాళలేక మంగళవారం పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు సాంబశివరావును హుటాహుటిన నూజివీడు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి నుంచి మెరుగైన వైద్యం నిమిత్తం విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

యూరియా అందుబాటులో ఉంచాలి : సిపిఎం

ప్రజాశక్తి - ముసునూరు

రైతులకు అవసరం ఉన్న మేరకు యూరియా అందుబాటులో ఉంచాలని సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు జి.రాజు ప్రభుత్వాని డిమాండ్ చేశారు. మండల కేంద్రమైన ముసునూరు సిపిఎం కార్యాలయంలో బుధవారం నిర్వహించిన ప్రత్యేక సమావేశంలో ఆయన మాట్లాడారు. యూరియాను బ్లాక్ మార్కెట్లో రూ.400 వరకు షాపు యజమానులు విక్రయించడం విడ్డూరంగా ఉందన్నారు. ఈ సమావేశంలో సిపిఎం మండల కార్యదర్శి కొడవలి శ్రీనివాస్, రైతులు పాల్గొన్నారు.

ముకొల్లుపాడులో రెవెన్యూ గ్రామసభ

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

మండలంలోని ముకొల్లుపాడు గ్రామంలో బుధవారం రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా నూజివీడు సబ్ కలెక్టర్ బొల్లిపల్లి వినూత్న మాట్లాడుతూ రెవెన్యూ సంబంధమైన సమస్యలపై ప్రజలు పదేపదే ఆఫీసు చుట్టూ తిరగాల్సిన అవసరం లేదన్నారు. తమ సిబ్బందితో గ్రామాల్లోని రెవెన్యూ సమస్యలు పరిష్కరించేందుకు వచ్చినట్లు వివరించారు. రైతుల పట్టా భూములు ప్రభుత్వ నోషనల్ ఖాతాలో పడ్డాయని 71 అర్జీలు వచ్చాయని తెలిపారు. వీటన్నిటిని పరిశీలించి పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బద్రు, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ అశోక్ కుమార్, విఆర్‌ఒ, రైతులు పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల సమస్యల పరిష్కారానికి కృషి

పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు

ప్రజాశక్తి - జీలుగుమిల్లి

మండలంలోని డ్వాక్రా మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పోలవరం ఎంఎల్‌ఎ చిర్రి బాలరాజు తెలిపారు. ఇటీవల మండలంలోని మూడు గ్రామ సంఘాల్లో స్త్రీ నిధి రుణాల విషయంలో అవకతవలు జరిగి పెద్ద మొత్తంలో ఒడి (ఓవర్ డ్యూ) ఉండటంతో అధికారులు విచారణ చేసి రుణాలు త్వరితగతిన కట్టాలని ఆదేశించారు. అయినా కట్టకపోవడంతో మండలంలోని అన్ని గ్రామ సంఘాలకు స్త్రీ నిధి రుణాలను నిలిపివేశారు. దీంతో మండలంలోని పలువురు విఒఎలు బుధవారం బర్రింకలపాడు ఎంఎల్‌ఎ క్యాంపు కార్యాలయంలో ఎంఎల్‌ఎ బాలరాజును కలిసి తమ సమస్యలను చెప్పుకున్నారు. సమస్యలు విన్న అనంతరం ఒడి ఎక్కువగా ఉన్న గ్రామ సంఘాల విఒఎలను త్వరగా ఒడిని కట్టాలని ఆదేశించారు. అనంతరం డిఆర్‌డిఎ పీడీ విజయరాజుతో ఫోన్‌లో మాట్లాడి ఒడి పెండింగ్‌లో ఉన్న గ్రామ సంఘాల అకౌంట్‌లు నిలిపి మిగతా గ్రామ సంఘాలకు స్త్రీ నిధి రుణాలు మంజూరుకు అవకాశం కల్పించాలని కోరడంతో ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం బి.శ్రీనివాసు, సీసీలు దుర్గారావు, అరుణ, ఎసేబు, విఒఎలు పాల్గొన్నారు.

గృహాలను డిసెంబర్‌లోపు పూర్తి చేయాలి

ప్రజాశక్తి - నూజివీడు టౌన్

పట్టణంలోని గృహ నిర్మాణ శాఖ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ కార్యాలయంలో బుధవారం హౌసింగ్ సిబ్బందితో ఏలూరు జిల్లా ప్రాజెక్ట్ డైరెక్టర్ సత్యనారాయణ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ గతంలో వివిధ దశల్లో ఉన్న గృహాలపై సిబ్బందితో చర్చించామన్నారు. వివిధ దశల్లో ఉన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించామన్నారు. డిసెంబర్ నెలాఖరు లోపు వివిధ దశల్లో ఉన్న గృహాలను త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ సిబ్బంది పాల్గొన్నారు.

పారదర్శకంగా యూరియా సరఫరా

ప్రజాశక్తి - చింతలపూడి

రైతులకు ఇబ్బందులు లేకుండా పారదర్శకంగా యూరియా అందించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వ్యవసాయ శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ వై.సుబ్బారావు తెలిపారు. చింతలపూడి సిఐ క్రాంతి కుమార్ ఆధ్వర్యంలో ఎస్ఐ సతీష్ జిల్లా కో-ఆపరేటివ్ మార్కెటింగ్ సొసైటీ స్టాక్ పాయింట్ వద్ద బుధవారం తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయాధికారి కె.మురళీకృష్ణతో కలిసి రైతులకు యూరియా పంపిణీ విధానాన్ని సమీక్షించారు.

శనివారపుపేట కాజ్‌వేపై వంతెన నిర్మించాలి

సిపిఎం

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్



కాజ్ వే పరిశీలిస్తున్న సిపిఎం నేతలు

తమ్మిలేరు శనివారపుపేట కాజ్‌వే పై వంతెన నిర్మాణానికి నిధులు మంజూరైనా నిర్మాణ పనులు ప్రారంభించకుండా తాత్సారం ఎందుకని సిపిఎం నగర కమిటీ ప్రశ్నించింది. సిపిఎం ప్రతినిధి బృందం శనివారపుపేట కాజ్ వేను సందర్శించి నిరసన తెలిపింది. ఈ సందర్భంగా సిపిఎం నగర కార్యదర్శి పంపన రవి కుమార్, శనివారపు పేట మాజీ ఎంపిటిసి సభ్యులు గొట్టాపు రవికిషోర్ మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో ఒక వంతెన నిర్మించటానికి దశాబ్దాలుగా కాలయాపన చేస్తున్నారని విమర్శించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకొచ్చిన వెంటనే రూ.15 కోట్లు వంతెన నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పిన టిడిపి కూటమి నాయకులు నేడు మౌనవ్రతం ఎందుకు చేస్తున్నారని ప్రశ్నించారు. ఏలూరు వరద ముంపునకు శాశ్వతంగా పరిష్కారం చూపించే వంతెన నిర్మాణంపై చిత్తశుద్ధి లేదన్నారు. తరచూ ఈ కాజ్ వే మునిసేయటం వల్ల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. కలెక్టర్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉండే ఈ ప్రాంతానికి పరిష్కారం లభించకపోవటం విచిత్రంగా ఉందన్నారు. ప్రతి ఏడాది కాజ్ వే మూతపడటం ఏలూరు ప్రజాప్రతినిధులకు సిగ్గు చేటన్నారు.ఇప్పటికైనా వంతెన నిర్మాణం ప్రారంభించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమం లో సిపిఎం నాయకులు వైఎస్.కనకారావు, ఎస్.సత్యనారాయణ, మీసాల సత్యం, పి.సూర్యనారాయణ, చంద్రరావు పాల్గొన్నారు.

రోగులకు మెరుగైన సేవలందించాలి

ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్

ప్రజాశక్తి - జంగారెడ్డిగూడెం


మాట్లాడుతున్న ఎంఎల్‌ఎ రోషన్‌కుమార్

జంగారెడ్డిగూడెం ఏరియా ఆసుపత్రిలో రోగులకు వైద్యులు మెరుగైన వైద్య సేందించాలని చింతలపూడి ఎంఎల్‌ఎ సొంగా రోషన్‌కుమార్ అన్నారు. బుధవారం నిర్వహించిన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ వద్ద నుంచి ఇన్ పేషెంట్స్ వివరాలు, డాగ్, స్నేక్ బైట్ కు సంబంధించి వారికి ఏవిధమైన చికిత్స అందుతుంది, డాక్టర్స్ పనితీరు, తదితర వాటిపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో మండల, పట్టణ కూటమి నాయకులు, హాస్పిటల్ అభివృద్ధి కమిటీ సభ్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అనంతరం పట్టణంలో పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. 25వ వార్డు, 26వ వార్డుల్లో సుమారు రూ.47 లక్షలతో నిర్మితమైన సిమెంట్ రోడ్లను ప్రారంభించారు. రాజీవ్ నగర్‌లో గణపతి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణ కార్యాలయంలో ఎంఎల్‌ఎ చేతుల మీదుగా సుమారు రూ.14.90 లక్షల విలువైన చెక్కులను 13 మంది లబ్ధిదారులకు అందించారు. నూతన మాగ్ స్పోర్ట్స్ బాక్స్ క్రికెట్ కోర్టును ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షులు కొండ్రెడ్డి కిషోర్, రాష్ట్ర క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్, కౌన్సిలర్ నంబూరు రామచంద్రరాజు, రాష్ట్ర బిసి కార్పొరేషన్ డైరెక్టర్ చిట్టిబోయిన రామలింగేశ్వరరావు, జెడ్‌పిటిసి సభ్యులు పోల్నాటి బాబ్జి, కౌన్సిలర్లు కరటూరి రమాదేవి, తెలగారపు జ్యోతి, సొసైటీ ఛైర్మన్ మాణికల నాగేశ్వరరావు, రావూరి కృష్ణ, సాయిల సత్యనారాయణ, సొసైటీ డైరెక్టర్ పాతూర్ అంబేద్కర్, పెనుమర్తి రామకుమార్, బొబ్బర రాజ్ పాల్ కుమార్, అబ్బిన దత్తాత్రేయ, మద్దిపాటి నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

తలసేమియా చిన్నారులకు రక్తమార్పిడి

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

ఏలూరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న రెడ్‌క్రాస్ తలసేమియా చికిత్స కేంద్రంలో బుధవారం 15 మంది తలసేమియా చిన్నారులకు చిన్నపిల్లల వైద్యులు ఆల్బర్ట్ ఆధ్వర్యంలో రక్తమార్పిడి నిర్వహించినట్లు రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా ఇన్‌ఛార్జి ఛైర్మన్ జె.సత్యనారాయణ రాజు తెలిపారు. ఈ సందర్భంగా రెడ్‌క్రాస్ కమిటీ సభ్యుడు ఆలపాటి నాగేశ్వరరావు మాట్లాడుతూ తలసేమియా, సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి ఉన్న చిన్నారులు క్రమం తప్పకుండా జీవితకాలం రక్తమార్పిడి చికిత్స చేయించుకోవాల్సి ఉంటుందని, అందుకు స్వచ్ఛంద రక్తదాతలు ముందుకొచ్చి రక్తదానం చేయాలని కోరారు. బుధవారం తలసేమియా చిన్నారులకు, వారి సహాయకులకు 35 మందికి భోజనం ఏర్పాటు చేసిన సత్యాన్స్‌సాయికి, ప్రోటీన్ పౌడర్లు, పండ్లను పంపిణీ చేసిన రోటరీ క్లబ్ ఎన్‌జివిబి.స్వామికి, శ్రీనివాస్‌కు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెడ్ క్రాస్ కార్యదర్శి బి.బెన్నీ, డాక్టర్ వరప్రసాద్‌రావు, హెడ్ నర్స్ శాంతకుమారి, మానవత సభ్యులు పాల్గొన్నారు.

బాధ్యతలకు నిలబడటమే ఎపిటిఎఫ్ ధ్యేయం

జిల్లా నాయకులు బేతాళ రాజేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - ముదినేపల్లి


సభ్యత్వం నిర్వహిస్తున్న రాజేంద్రప్రసాద్

హక్కుల కోసం పోరాడటమే కాకుండా బాధ్యతలకు ఎపిటిఎఫ్ ఎప్పుడూ ముందే నిలబడుతుందని ఎపిటిఎఫ్ జిల్లా నాయకులు బేతాళ రాజేంద్రప్రసాద్ సభ్యత్వ కార్యక్రమంలో తెలిపారు. వార్షిక క్యాంపెయిన్‌లో భాగంగా మండలంలో బుధవారం విస్తృతంగా పాఠశాలల ఉపాధ్యాయులను కలిశారు. సభ్యత్వ కార్యక్రమంలో ఉపాధ్యాయుల నుంచి మంచి స్పందన లభించిందని రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా పలువురు ఉపాధ్యాయులు పిఎఫ్‌కు సంబంధించి సమస్యలు చెప్పారని, మండలాన్ని కృష్ణా జిల్లాలో కలిపేలా సంఘం తరపున వినతిపత్రం అందించాలని కోరారన్నారు. అసెస్‌మెంట్ బుక్ విధానాలను రద్దు చేయాలని, టీచర్స్‌కు యాప్‌ల భారాన్ని తొలగించాలని, లేకుంటే రాష్ట్ర సంఘం తరుపున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని తెలిపారు. ఈ సభ్యత్వ కార్యక్రమంలో మండల అధ్యక్షులు కృపాకర్, వెంకటరత్నం, దాసు, సుబ్రహ్మణ్యం, జాన్సన్, రవినాధ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి బిజెపి జెండాలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ


అంబేద్కర్ విగ్రహానికి జెండాలు

బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్.మాధవ్ బుధవారం ఏలూరులో పర్యటించారు. ఆయన పర్యటన సందర్భంగా బిజెపి నాయకులు ఏలూరు పాత బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహానికి బిజెపి జెండాలను కట్టారు. దీంతో ప్రజలు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇంతకుముందు రాష్ట్ర నాయకులు ఎవరూ పర్యటించిన అంబేద్కర్ విగ్రహానికి జెండాలను ఎప్పుడూ కట్టలేదని, బిజెపి జెండాలను వెంటనే తీసివేయాలని ప్రజలు కోరుతున్నారు.

'పేదల సౌలభ్యం కోసమే స్మార్ట్ రేషన్ కార్డులు'

ప్రజాశక్తి - టి.నరసాపురం


పేదల సౌలభ్యం కోసమే ప్రభుత్వం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేస్తున్నట్లు టిడిపి రాష్ట్ర కార్యదర్శి శీలం వెంకటేశ్వరరావు తెలిపారు. మండలంలోని వెలగపాడు పంచాయతీలో ఆయన బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం వినూత్న రీతిలో పేదల సౌలభ్యం కోసం ప్రవేశపెట్టిన స్మార్ట్ రేషన్ కార్డులు వినియోగించుకోవాలని తెలిపారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీతో ప్రజా పంపిణీ వ్యవస్థ మరింత పారదర్శకంగా నిర్వహించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచి నైనారపు జలపాలు, మల్లుకుంట సొసైటీ ఛైర్ పర్సన్ శీలం సాయి వినయ్, జోనుబోయిన భాషా, నాగార్జున, సిద్దిరాజులు, జాజుల గిరి, శీలం సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

చింతలపూడి : మండలంలోని ప్రగడవరంలో ఎన్‌టిఆర్ విగ్రహం వద్ద లబ్ధిదారులకు స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ కమిటీ అధ్యక్షులు తాళ్లూరి చినబాబు, మాజీ ఎంపిటిసి సభ్యులు కనమతరెడ్డి రాజారెడ్డి, క్లస్టర్ ఇన్‌ఛార్జి బుద్దాల నాగవర్ధన్, గ్రామకమిటీ సెక్రటరీ తాళం. చెన్నారావు, చిలుకూరి శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

ద్వారకాతిరుమల : మండలం జాజులకుంట గ్రామంలో బుధవారం స్మార్ట్ రేషన్ కార్డులు పంపిణీ చేశారు. టిడిపి మండలాధ్యక్షులు లంకా సత్యనారాయణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో పార్టీ గ్రామ అధ్యక్షులు సాయిల రమేష్, కలపాల రవీంద్ర, సురేష్, పార్టీ నాయకులు నాదెళ్ల వెంకటేశ్వరరావు, రేషన్ డీలర్ రమేష్, స్థానిక సచివాలయ సిబ్బంది, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల్లో తప్పులు

వేలేరుపాడు రూరల్ : మండలంలోని రుద్రంకోట, భూదేవి పేట తదితర గ్రామాలలో కూటమి నాయకుల ఆధ్వర్యంలో ప్రజలకు స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేశారు. ఈ స్మార్ట్ రేషన్ కార్డు బయోడేటాలో జిల్లా పేరు మారకపోవడంపై పలువురు తలలు పట్టుకుంటున్నారు. దీనిపై అధికారులు స్పందించి ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొకుండా ప్రత్యామ్నాయ మార్గం చూపాలని కోరుతున్నారు. కార్డుల్లో పశ్చిమగోదావరి అని పడడంతో భిన్నాభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



జిల్లా పేరు తప్పుగా వచ్చిన కార్డు

సురవరం మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటు

ప్రజాశక్తి - వేలేరుపాడు రూరల్

సురవరం సుధాకర్‌రెడ్డి మృతి వామపక్ష ఉద్యమానికి తీరని లోటని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య అన్నారు. సురవరం సుధాకర్ రెడ్డి సంస్మరణ సభను మండల కేంద్రంలో స్థానిక సిపిఐ కార్యాలయంలో సిపిఐ మండల కార్యదర్శి బాడిస రాము అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. సభకు ముఖ్య అతిథిగా హాజరైన కృష్ణచైతన్యతో పాటు పలు పార్టీల నాయకులు సురవరం చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సురవరం విద్యార్థి దశ నుంచి అంచెలంచెలుగా ఉద్యమమే ఊపిరి అనే స్ఫూర్తితో సిపిఐలో అగ్రనేతగా ఎదిగారన్నారు. ఆయన చేసిన ప్రజా పోరాటాల స్ఫూర్తితో పనిచేయాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ సంస్మరణ సభలో సిపిఐ రాష్ట్ర, జిల్లా నాయకులు ఎండి మునీర్, సన్నేపల్లి సాయిబాబు, కారం దారయ్య, పిట్టా ప్రసాద్, పిట్టా వీరయ్య, ఐయిత సురేష్, కాంగ్రెస్ నాయకులు కొల్లూరి సత్యనారాయణ, వలగాని సమ్మయ్య, భీమయ్య, సిపిఐ ఎంఎల్ ప్రజా పంథా మాస్ లైన్ నాయకులు సిరికొండ రామారావు, గడ్డాల ముత్యాలరావు, సిపిఎం నాయకులు ధర్మల రమేష్, వెంకట్రావు, సిపిఐ స్థానిక నాయకులు గోపీవర్మ, సోడే ప్రసాద్, సోడే సత్తిబాబు, తాటి దుర్గారావు, మడకం దుర్గారావు, పిట్టా జయ, మడివి కామయ్య, కరటం వెంకటేశ్వర్లు, సోడే మారయ్య, మచ్చ చంద్రరావు, తెల్లం మహేష్ తదితరులు పాల్గొన్నారు.

కుక్కునూరు రూరల్ : సిపిఐ సీనియర్ నాయకులు, మాజీ జాతీయ కార్యదర్శి, మాజీ పార్లమెంటు సభ్యులు సురవరం సుధాకర్ రెడ్డి కమ్యూనిస్టు ఆదర్శాలను నిబద్ధతతో పాటిస్తూ వాటిని ఆచరణలో జోడించి పాలకుల ప్రజా వ్యతిరేక విధానాలపై పోరాడిన మహనీయుడని సిపిఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణచైతన్య, అఖిలపక్ష నాయకులు కొనియాడారు. సిపిఐ మండల సమితి ఆధ్వర్యంలో కుక్కునూరులో బుధవారం సంసర్మణ సభ నిర్వహించారు. సురవరం మృతికి సంతాపంగా తొలుత ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. సభలో జిల్లా కార్యదర్శి కృష్ణచైతన్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు ఎర్రంశెట్టి నాగేంద్రరావు, సిపిఐ మండల కార్యదర్శి కొన్నె లక్ష్మయ్య, సిపిఐ, వైసిపి నాయకులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

సిఐలకు డిఎస్‌పిలుగా ఉద్యోగోన్నతి

ప్రజాశక్తి - ఏలూరు స్పోర్ట్స్

రాష్ట్రంలో ఎనిమిది మంది సిఐలకు డిఎస్‌పిలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ రాష్ట్ర పోలీసు కార్యాలయం నుంచి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఇందులో భాగంగా ఏలూరు రేంజ్‌కు చెందిన ఇద్దరు సిఐలు ఉద్యోగోన్నతి పొందారు. ఏలూరు రేంజ్‌లో ప్రస్తుతం పని చేస్తున్న పి.శ్రీనివాస్, ఇదే రేంజ్‌లో పనిచేస్తున్న పి.ఈశ్వరుడు ఉద్యోగోన్నతి పొందారు. వీరిని రాష్ట్ర పోలీస్ కార్యాలయం మంగళగిరిలో రిపోర్ట్ చేయాలని సూచించారు.

బార్లకు లైసెన్సులు పొందేందుకు దరఖాస్తుల స్వీకరణ

ప్రజాశక్తి - ఏలూరు అర్బన్

జిల్లాలో తొమ్మిది బార్లకు 2025 - 2028 కాలానికి లైసెన్సులు పొందేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తూ బుధవారం జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ ఆఫీసర్ ఎ.ఆవులయ్య గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేశారు. గత నెలలో జిల్లా వ్యాప్తంగా 20 బార్లకు నోటిఫికేషన్ విడుదల చేయగా 11 బార్లకు మాత్రమే దరఖాస్తులు రావడంతో వాటిని డ్రా తీసి సదరు అభ్యర్థులకు కేటాయించారు. మిగిలిన తొమ్మిది బార్లలో ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో ఎనిమిది బార్లు, జంగారెడ్డిగూడెంలో ఒక బారు మొత్తం తొమ్మిది బార్లకు ఈ నెల మూడో తేదీ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తూ నోటిఫికేషన్ విడుదల చేశారు. ఈ దరఖాస్తులను సెప్టెంబరు 14వ తేదీ సాయంత్రం ఆరు గంటల వరకు ఆన్‌లైన్‌లో, లేదా ఎక్సైజ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆఫ్‌లైన్‌లో కూడా దాఖలు చేసుకోవచ్చని తెలిపారు. ఈ నెల 15వ తేదీ ఉదయం ఎనిమిది గంటలకు కలెక్టరేట్‌లో కలెకర్ సమక్షంలో లాటరీ తీసి అభ్యర్థులను ఎంపిక చేయనున్నట్లు తెలిపారు. దరఖాస్తు ఫీజుగా రూ.ఐదు లక్షల డిడి లేదా ఆన్‌లైన్ ద్వారా చెల్లించాలని, ఈ రూ.ఐదు లక్షలు తిరిగి ఇవ్వరని, లాటరీలో గెలుపొందిన అభ్యర్థులు ఏలూరు కార్పొరేషన్ పరిధిలో మొదటి ఏడాది రూ.55 లక్షలు, రెండో ఏడాది రూ.60.50 లక్షలు, మూడో ఏడాది రూ.66.55 లక్షలు లైసెన్స్ ఫీజుగా చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. జంగారెడ్డిగూడెంలో మొదటి సంవత్సరం రూ.35 లక్షలు, రెండో సంవత్సరం రూ.38.50 లక్షలు, మూడో సంవత్సరం రూ.42.35 లక్షలు చెల్లించాల్సి ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న అభ్యర్థులు సెప్టెంబర్ 14వ తేదీ సాయంత్రం ఆరు గంటల్లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

కల్తీ మద్యం విక్రయిస్తే చర్యలు

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

జిల్లాలో ఇటీవల మళ్లీ అక్రమ మద్యం కేసులు వెలుగు చూడటంపై ఆందోళనకమని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అన్నారు. కొన్ని గ్రామాల్లో అక్రమ మద్యం అమ్ముతున్న విషయం తన దృష్టికి వచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారులతో మాట్లాడారు. ఎక్కడైనా బెల్ట్ షాపులు కనిపించినా, కల్తీ మద్యం అమ్ముతున్నట్లు తెలిసినా సహించేది లేదన్నారు. జిల్లాను అక్రమ మద్య రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు అధికారులు కృషి చేయాలని కోరారు.

9న ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద నిరసన : వైసిపి

ప్రజాశక్తి - ఏలూరు సిటీ

రైతన్నలు పడుతున్న కష్టాలపై వైసిపి పోరాడుతుందని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు తెలిపారు. ఏలూరులోని వైసిపి జిల్లా కార్యాలయంలో బుధవారం నిర్వహించిన పత్రిక సమావేశంలో ఆయన మాట్లాడారు. కూటమి పాలనలో రైతులకు యూరియా దొరకడం చాలా కష్టంగా ఉందన్నారు. కోపరేటివ్ సొసైటీలో సైతం రైతులకు యూరియా అందడం లేదన్నారు. రైతులకు అండగా ఈనెల 9వ తేదీన ఆర్‌డిఒ కార్యాలయాల వద్ద నిరసన కార్యక్రమం చేపట్టి వినతిపత్రం అందిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా పార్లమెంటరీ అధ్యక్షుడు పుప్పాల వాసుబాబు, నూజివీడు మాజీ ఎంఎల్‌ఎ మేకా వెంకట ప్రతాప్ అప్పారావు, చింతలపూడి నియోజకవర్గ ఇన్‌ఛార్జి కంభం విజయరాజు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.